

## పక్కపక్కనే ఉంటే?

ఓ స్టేడియానికో, మాల్‌కో వెళ్తాం. అక్కడ కోకకోలా వెండింగ్ మెషిన్ కనిపిస్తుంది. సరే! కానీ సరిగ్గా దాని పక్కనే పెప్సీ మెషిన్ కూడా ఉంటుంది. గమనించారా? అనూహ్యమైన పోటీ ఉన్న ఉత్పత్తి పక్కనే, తమ ఉత్పత్తిని ఎందుకు ఉంచినట్టు? అలా కాకుండా ఇంకాస్త దూరంగా ఉంచితే ఇద్దరికీ లాభం కదా! ఇక్కడ ఓ చిన్న మాయ ఉంది. ఒక్క కోక్ మెషిన్ మాత్రమే మన కళ్లకు కనిపిస్తే... కోక్ తాగాలా వద్దా అన్న ఆలోచన మాత్రమే వస్తుంది. అలా కాకుండా కోక్, పెప్సీ మెషిన్లు పక్కపక్కనే ఉంటే... ఆ రెండిట్లో ఏది తాగాలి అనే ఎంపిక మొదలవుతుంది? సాధారణంగా ఏదో ఒకటి కొనుక్కుని మరీ వెళ్తారు. అందుకే ఈ ప్రణాళికను అనుసరించి కోకకోలా, పెప్సీలు విపరీతంగా లాభపడ్డాయని తేలింది. సినిమా హాల్స్ నుంచి చీరల దుకాణాల వరకూ పక్కపక్కనే ఉండటం వల్ల కలిగే లాభం ఇదే. కొనడం అవసరమా కాదా అన్న ఆలోచన నుంచి ఏది కొనాలి అనే స్థాయికి మన మెదడుని మాయ చేయడం.

# పోటీలో గమ్మత్తు!

పెన్సిల్వేనియా యూనివర్సిటీ చేసిన ఓ పరిశోధనలో వ్యాయామం చేయాలి అనుకునేవారు ఒంటరిగా చేసేదానికంటే.. ఇతరులతో కలిసి కష్టపడినప్పుడే ఫలితం ఎక్కువగా ఉంటుందట. అవతలి వ్యక్తిని మించో లేక తనకు దీటుగానో చేయాలనే పోటీతత్వమే ఇందుకు కారణం!

కోతి నుంచి మనిషి రూపొందే క్రమంలో మధ్యస్తంగా ఎన్నో జాతులు ఆవిర్భవించాయి. వాటి మధ్య ఓ పోటీ కూడా మొదలైంది. మరింత దృఢంగా ఉండాలని, మరింత వేగంగా తమ జాతిని విస్తరింపచేసుకోవాలి అనే ఆ తత్వమే పరిపూర్ణమైన మనిషి రూపానికి దారితీసింది అంటున్నారు శాస్త్రవేత్తలు.

మనుషులు, జంతువుల్లోనే కాదు... చెట్ల మధ్య కూడా పోటీతత్వం ఉంటుందని స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ గమనించింది. సూర్యరశ్మిని తగినంతగా గ్రహించేందుకు వీలైనంత త్వరగా ఎదగడం, వర్షపు నీటిని ఒడిసిపట్టుకునేందుకు వేళ్లను మరింతగా విస్తరించడం, ఆహారాన్ని తయారుచేసుకునేందుకు ఆకులను వెడల్పు చేసుకోవడం... లాంటి చర్యలతో చుట్టుపక్కల ఉన్న చెట్ల మధ్య ఓ కనిపించని పరుగే ఉంటుందట.

ఓ ఇరవై లక్షల ఏళ్ల క్రితం ఉన్న మనిషి మెదడు కంటే ఇప్పుడు మూడు రెట్లు పెద్దదిగా ఉందట. ఇతర జీవులతో పోలిస్తే మన మెదళ్లే ఎందుకింత వేగంగా మార్పు చెందాయి అన్న విషయం శాస్త్రవేత్తలకు చాలా రోజులపాటు అర్థం కాలేదు. చివరికి ఈ అభివృద్ధికి మూడు ముఖ్యమైన కారణాలు కనిపించాయి. ఒకటి- వాతావరణంలో వచ్చిన అనూహ్యమైన మార్పులు, రెండు- మారుతున్న జీవన విధానంలో ఎదురయ్యే సమస్యలకు అనుగుణంగా ఎదిగే ప్రయత్నం చేయడం! ఇక మూడో అతి ముఖ్యమైన కారణం... సామాజికపరమైన పోటీ. జీవితంలో ఎదిగేందుకు, తనను తాను నిరూపించుకునేందుకు, కుటుంబాన్ని పోషించేందుకు ఇతరులతో పోటీపడాల్సి రావడమే ఆ మూడో కారణం. పోటీ లేకపోతే మనిషి ఉంటాడు కానీ, అతని ఉన్నతి, ఉనికి మాత్రం నామమాత్రంగానే మిగిలిపోతుందని నిరూపించే సత్యమిది. కాకపోతే ఒకే ఒక్క గోల్డెన్ రూల్. విజయం కంటే విలువలు ముఖ్యమనే పెద్దల మాటను మర్చిపోకుండా ఉంటే చాలు.